నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

బంజారాహిల్స్,డిసెంబర్ 26: చెట్ల కొమ్మల కత్తిరింపు, విద్యుత్ కేబుళ్ల మరమ్మతులతో పాటు ఇతర మెయింటెనెన్స్ పనుల కారణంగా బంజారాహిల్స్ సబ్ సబ్ డివిజన్ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా ఉండదని టీఎస్‌పీడీసీఎల్ బంజారాహిల్స్ ఏడీఈ గోపి ఒక ప్రకటనలో తెలిపారు. బంజారాహిల్స్‌లోని ఎల్వీ ప్రసాద్ సబ్ స్టేషన్ పరిధిలోని అన్నపూర్ణ ఏడెకరాల స్టూడియో, మోర్ సూపర్‌మార్కెట్ లేన్, కాకర్ల సుబ్బారావు నివాసం, వెంకటగిరి దిగువ ప్రాంతాలు, బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 13లోని శ్రీరాం నగర్, బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12 మెయిన్ రోడ్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట దాకా కరెంట్ సరఫరా ఉండదు. కళ్యాణ్‌నగర్ సబ్ స్టేషన్ పరిధిలోని మధురానగర్ ఏ,సీ, డీ, హెచ్ బ్లాకులు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 13 సబ్‌స్టేషన్ పరిధిలోని సాయి ఎన్‌క్లేవ్ ఏరియా, బంజారా కమలా అపార్ట్‌మెంట్స్, కంట్రీ హాస్పిటల్స్, రోడ్డు నంబర్ 12 తదితర ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని విద్యుత్‌శాఖ అధికారులు పేర్కొన్నారు.

రేపు రతన్‌టాటా ఎక్సలెన్సీ అవార్డుల ప్రదానం

తెలుగు యూనివర్సిటీ : తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఆబిడ్స్ తిలక్ రోడ్డు బొగ్గులకుంటలో గల తెలంగాణ సారస్వత పరిషత్తు ఆడిటోరియంలో డిసెంబర్ 28న శనివారం ఉదయం 10గంటలకు ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్‌టాటా 86వ జయంతి సందర్భంగా పలువురు ప్రొఫెసర్లకు రతన్‌టాటా ఎక్సలెన్సీ అవార్డులను ప్రదానం చేయనున్నట్లు కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రతన్ టాటా జీవిత చరిత్రపై నగరంలోని పలు ఎంబీఏ కళాశాలల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలలో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు, సర్టిఫికెట్‌లను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటికల పురుషోత్తం, శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఉమేశ్‌కుమార్, హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, ఉన్నతవిద్యాశాఖ కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేశ్ తదితరులు పాల్గొంటారని రాజ్‌నారాయణ్ ముదిరాజ్ పేర్కొన్నారు.

డీడీఈఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మడుగు శ్రీనివాస్

చిక్కడపల్లి: దివ్యాంగజన్ డెఫ్ ఎంప్లాయిస్ అసోసియేషన్(డీడీఈఏ) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మడుగు శ్రీనివాస్ ఎంపికయ్యారు. అసోసియేషన్ సమావేశం గురువారం బాగ్‌లింగంపల్లిలో జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల నుంచి సంఘం నాయకులు హాజరై ఉపాధ్యక్షుడిగా మడుగు శ్రీనివాస్‌ను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా దివ్యాంగ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

మేయర్ ప్రాతినిధ్యం బస్తీలో .. అధ్వానంగా రోడ్లు

నగర మేయర్ ప్రాతినిధ్యం వహిస్తున్న డివిజన్‌లోని ఓ బస్తీలో రోడ్లు అధ్వానంగా మారాయి. ఫలితంగా నిత్యం ఆ రోడ్లపై ప్రయాణించే బస్తీ వాసులు ప్రత్యక్ష నరకం అనుభవిస్తున్నారు. గతుకుల రోడ్లపై ప్రయాణిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. బంజారాహిల్స్ డివిజన్‌లోని ప్రేమ్‌నగర్ బస్తీలోని రోడ్డు గతుకుల మయంగా మారింది. గతేడాది ఇక్కడ తాగునీటి పైపులైను మార్చేందుకు రోడ్డంతా ఇష్టంవచ్చినట్లు తవ్వేశారు. అయితే పనులు ముగిసిన తర్వాత తిరిగి రోడ్డును వేయాల్సి ఉండగా, సంవత్సర కాలంగా పట్టించుకోలేదు. గతంలోనూ ఇక్కడ రోడ్డు మంజూరైనా టెండర్ల దశలో నిలిచిపోయింది. స్థానిక బస్తీ వాసులు జీహెచ్ఎంసీ అధికారులకు, మేయర్ దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. సుమారు అర ఫీటు కంటే ఎక్కువగా కిందకు తవ్వడంతో మ్యాన్‌హోళ్లు సైతం పైకి వచ్చాయి. పైపులైను వేసిన చోట అడ్డదిడ్డంగా సిమెంటు ప్యాచ్‌లు వేసి వదిలివేయడంతో దానిపై ప్రయాణిస్తూ ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.
– ఖైరతాబాద్, డిసెంబర్ 26

గొర్ల కాపరుల అభివృద్ధికి .. ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

మైలార్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 26: హైదరాబాద్ పాలమూరు కురువ సంఘం ఆధ్వర్యంలో బాబుల్‌రెడ్డినగర్ కాలనీలో ఉన్న పోచమ్మ దేవాలయంలో హెచ్‌పీకేఎస్ నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంఘం వ్యవస్థాపకులు కొల్లంపల్లి శ్రీనివాస్ కురువ, జిల్లా అధ్యక్షులు మాదారం కృష్ణ కురువ, జంట నగరాల అధ్యక్షులు ఎస్.వెంకటేష్ కురువలు హాజరై నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గొర్రె కాపరులు అప్పులు చేసి కొన్న గొర్రెలను అడవిలో గొర్రెలను మేపుకుంటు వెళ్తుంటారన్నారు. అనుకోకుండా రోడ్డుపైకి వచ్చిన గొర్రెలను భారీ వాహనాలు గొర్రెలను ఢీ కొట్టడంతో మృతి చెందిన సందర్భాలు చాలానే ఉన్నాయి. గొర్రెల కాపరుల కుటుంబాలు వీధిన పడకుండా వారికి రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్ పాలమూరు కురువ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

అండగా ఉండి గొర్రెలకు ఇన్సూరెన్స్, గొర్రె కాపరుల అభివృద్ధికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కోస్గి హనుమంతు కురువ, బాన్యనోల రామచందర్ కురువ, జేట్రం శ్రీనివాస్ కురువ, కాంతల అశోక్‌కురువ, నామల రాముకురువ, మల్లేష్ కురువ, కొల్లురు శివ కురువ, మహేందర్ కురువ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం

మణికొండ, డిసెంబర్ 26: దేశంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాస్తూ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని రాజేంద్రనగర్ మండల కార్యదర్శి జాజాల రుద్రకుమార్ అన్నారు. సీపీఎం పార్టీ గండిపేట్ మండలం–1 మహాసభలు గురువారం మణికొండ నెమలినగర్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకులు ఎ.అశోక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు గోరికల నర్సింహ, జిల్లా కమిటీ సభ్యులు అలిదేవేందర్‌లతో కలిసి రుద్రకుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజల జీవితాలతో ఆటలాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అమలు చేయకుండా.. దేశంలో కులమతలతో రెచ్చగొడుతుందన్నారు. దేశాభివృద్ధిని గాలికి వదిలేసిందన్నారు. బడా పెట్టుబడిదారులు కార్పొరేట్ సంస్థలకు కోట్ల రూపాయల రాయితీలు ఇస్తూ పేద ప్రజల జీవితాలతో ఆటలాడుతుందన్నారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అధికారం కట్టబెట్టితే ఇచ్చిన ఆరు హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తూ కాలయాపన చేస్తుందన్నారు.

మణికొండలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, కార్యకర్తలు

మండల కమిటీ ఎన్నిక...

సీపీఎం పార్టీ మండల కార్యదర్శిగా డప్పు ప్రవీణ్‌కుమార్, మండల కమిటీ సభ్యులుగా ఎం.అశోక్, మైపాల్‌యాదవ్, యాదగిరి, సుభాష్, భారతమ్మ, నాగేష్‌గౌడ్, బి.బాలరాజ్, రాజుగౌడ్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులంతా రానున్న రోజుల్లో నిరంతరం ప్రజల సమస్యలపై పోరాటం చేస్తూ ప్రజల్లో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గురుద్వార్‌లో వీర బాల దివస్

అత్తాపూర్ గురుద్వార్‌లో వీర బాల దివస్ కార్యక్రమంలో పాల్గొన్న చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చారి తోకల శ్రీనివాస్‌రెడ్డిలు

మైలార్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 26: అత్తాపూర్ నౌనెంబర్ గురుద్వార్‌లో వీర బాల దివస్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జీ తోకల శ్రీనివాస్‌రెడ్డిలు గురుద్వార్ ఇస్లాం మతోన్మాదానికి బలైన అమరవీరులకు నివాళులర్పించి ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1704 సంవత్సరంలో మొగలు నవాబ్ వజీర్‌ఖాన్ మతం మారాలంటూ ఇద్దరు షహజాదేలను చిత్రహింసలు పెట్టారన్నారు. ప్రతి ఏటా డిసెంబర్ 26న వీర బాల్ దివస్ ఇస్లాం మతోన్మాదానికి బలైన అమరవీరులను స్మరించుకోవాలని ధర్మం కోసం వారు చేసిన ప్రాణత్యాగం గుర్తుగా జరుపుకొని ఐక్యతను చాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మల్లారెడ్డి, కొమురయ్య, సాబాద విజయ్‌కుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముస్లింలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న అజీజ్‌పాషా

హిమాయత్‌నగర్,డిసెంబర్ 26: రాష్ట్రంలోని ముస్లింల సంక్షేమం,అభివృద్ధి కోసం కృషి చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చి అమలు చేయడంలో విఫలమైందని మాజీ ఎంపీ సయ్యద్ అజీజ్‌షాషా, ఉమ్మడి రాష్ట్రం మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఎం.ఎ.సిద్ధిఖీ ఆరోపించారు.గురువారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ముస్లింల సంక్షేమం కోసం కేటాయించిన రూ.3వేల బడ్జెట్‌లో కేవలం 40 శాతం మాత్రమే ఖర్చు చేసిందన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో ముస్లిం శ్మశాన వాటికలు కనుమరుగవుతున్నాయని,నగర శివారులో 125 ఎకరాల వక్ఫ్ బోర్డు భూమిని కేటాయించాలని డిమాండ్ చేశారు.ఇల్లు లేని పేద ముస్లింలకు వంద గజాల స్థలం కేటాయించాలన్నారు. ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్ అమలు చేసి వక్ఫ్‌బోర్డు కమిషనరేట్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో ఆల్ ఇండియా ముస్లిం మైనార్టీ ఆర్గనైజేషన్ నేతలు సనావుల్లాఖాన్,మునీర్,మహ్మద్ జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయాలకు ప్రాధాన్యం

హిమాయత్‌నగర్,డిసెంబర్26: చెక్క తీగల తోలు బొమ్మలాటతో శతాబ్దాల నాటి కథా సంప్రదాయాన్ని పరిరక్షించేందుకు కృషి చేసిన కళాకారుడు మోతె జగన్నాథం ఆకస్మిక మృతి పట్ల తెలంగాణ దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ ఛైర్మన్ మణికొండ వేదకుమార్ గురువారం ఒక ప్రకటనలో తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.
జగన్నాథం రామాయణం, మహాభారతం వంటి ఇతిహాసాలకు,ప్రహ్లాద,రామదాసు కథలకు ప్రాణం పోసి ప్రజల్లో సాంస్కృతిక అవగాహన పెంచేందుకు అనేక వర్క్‌షాప్‌లు,ప్రదర్శనలు చేశారని గుర్తు చేశారు.బొమ్మలోలు అనే డాక్యుమెంటరీ చిత్రంలో జగన్నాథ జీవితం,కళా రంగానికి ఆయన చేసిన సేవలను చక్కగా తెలియజేశారని తెలిపారు.కళారంగానికి ఆయన మృతి తీరని లోటని అన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన

కూచిపూడి నృత్యప్రదర్శన చేస్తున్న కళాకారిణులు

రవీంద్రభారతి, డిసెంబర్ 26 : కళానృత్య నికేతన్ స్కూల్ ఆఫ్ కూచిపూడి అకాడమీ 16 వ వార్షికోత్సవవాల సందర్భంగా కళానృత్య నికేతన్ అధ్యక్షురాలు నాట్యగురువు డాక్టర్ బిందు అభినయ్ ఆధ్వర్యంలో కూచిపూడి నృత్యప్రదర్శన గురువారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళానృత్యనికేతన్ సంస్థను 2007లో స్థాపించి హైదరాబాద్ నగరం మంతా వివిధ శాఖలుగా విస్తరించి కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా 146మంది ప్రదర్శించిన కూచిపూడి నృత్యం వీక్షకులను ఆకట్టుకున్నది. ఈ కార్యక్రమంలో పద్మశ్రీ పద్మజారెడ్డి, భాగవతుల సేతురామ్, కళాకృష్ణ, పద్మశ్రీ ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికులకు 12వేలు ఇవ్వాలి

సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు

చిక్కడపల్లి, డిసెంబర్ 26: భూమి లేని వ్యవసాయ కార్మికులకు 12వేలు ఇవ్వాలని, లబ్ధిదారులను గ్రామ సభల ద్వారా ఎంపిక చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.నాగయ్య, ఆర్.వెంకట్రాములు, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్, కేవీపీఎస్ నాయకుడు స్కైలాబాబు, సారంపల్లి మల్లారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆధార్ కార్డు, పట్టా పాస్‌బుక్ ఆధారంగా రూ.12వేలు అందజేసే పథకానికి ఎంపిక చేయబోతున్నట్లు వస్తున్న వార్తలపై ప్రభుత్వం వివరణ ఇవ్వాలని అన్నారు. లబ్ధిదారులను కుదించే చర్యలకు స్వస్తి చెప్పి గ్రామ సభల ద్వారానే లబ్ధిదారులను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు వెంకట్, శ్రీరామ్‌నాయక్, శోభన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ రంగంలో ఎస్సీలకు రిజర్వేషన్లు కల్పించాలి

హిమాయత్‌నగర్,డిసెంబర్ 26: ఉభయ తెలుగు రాష్ట్రాలోని ప్రైవేట్ రంగంలో ఎస్సీలకు రిజర్వేషన్లు కల్పించేందుకు ఏపీ,తెలంగాణ ప్రభుత్వాలు తగిన చర్యలు చేపట్టాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో వచ్చిన తరువాత ప్రభుత్వ రంగ సంస్థలను ఉత్తర భారత వ్యాపార వేత్తలకు విక్రయించారని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ,బీసీలకు ప్రభుత్వ రంగాల్లో ఉద్యోగాలు లేకపోవడంతో నిరుద్యోగ యువత ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు.దళిత బహుజనుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని అవలంభిస్తుందన్నారు. దేశంలో సామాజిక ఆర్థిక, అసమానతలు పెరిగిపోతున్నాయని,పేదలు మరింత పేదలుగా మారుతుంటే ధనవంతులు మాత్రం కోట్లకు కోట్లు సంపాదిస్తూ పడగలెత్తుతున్నారని ఆరోపించారు. పెరిగిన జనాభా ప్రకారం ఎస్సీలకు రిజర్వేషన్లు పెంచి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీలకు 26 శాతం రాజకీయ రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

సుల్తాన్‌బజార్ : తెలంగాణ రాష్ట్రంలో వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న జాతీయ ఆరోగ్య మిషన్ 78క్యాడర్లలో పనిచేస్తున్న 17, 541మందికి రెగ్యులర్ బేసిక్ పే వెంటనే అమలు చేయాలని జాతీయ మిషన్ కాంట్రాక్టు అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామరాజేష్‌ఖన్నా గురువారం ఒక ప్రకటనలో ప్ర భుత్వాన్ని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎన్‌హెచ్ఎం ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని అన్నారు. సమాన పనికి సమాన వేతనం అందించాలని అన్నా రు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం విడుదల చేసిన పీఆర్‌సీ ఏరియర్స్ వెంటనే విడుదల చేయాలన్నారు. మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని కోరారు. 1న వేతనాలు అందించాలని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి అయినా సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యోగుల సమస్యలపై దృష్టి పెట్టకపోవడం శోచనీయమని ఆయన అన్నారు.

కేంద్ర ప్రభుత్వం విధానాలపై సమరశీల పోరాటాలు చేయాలి

హిమాయత్‌నగర్,డిసెంబర్ 26: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలు చేయాలని సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా,శాస్త్రవేత్త మర్ల సోమ, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ. యూసుఫ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్ కార్మికవర్గానికి పిలుపు నిచ్చారు. సీపీఐ శత వసంతాల వార్షికోత్సవం సందర్భంగా కార్మికవర్గ పోరాటాలు– భవిష్యత్తు కర్తవ్యం అనే అంశంపై గురువారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో సదస్సు నిర్వహించారు.ఈ సదస్సుకు వారు హాజరై మాట్లాడుతూ దేశంలోని కార్మికుల హక్కుల సాధన కోసం ఏఐటీయూసీ నిరంతరం పోరాటాలు చేసి ఎన్నో విజయాలు సాధించడం జరిగిందన్నారు. జాతీయోద్యమంలో సీపీఐ,కార్మికోద్యమంలో ఏఐటీయూసీ చేసిన కృషి ఎనలేనిదన్నారు. దేశ సంపదలైన సహజ వనరులు,ప్రభుత్వ రంగ సంస్థలను కొల్లగొట్టి కార్మిక వర్గంపై మోదీ సర్కార్ వేగవంతంగా దాడి చేస్తుందని ఆరోపించారు. కార్మికవర్గం ముందు అనేక సవాళ్లు ఉన్నాయని,ఐక్య ఉద్యమాలతో ప్రభుత్వ సంస్థలను, చట్టాల అమలు,హక్కులను కాపాడుకోవాలని పిలుపు నిచ్చారు.ఈ సదస్సులో ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ,రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.ప్రేంపావని,నగర ప్రధాన కార్యదర్శి కమతం యాదగిరి,నేతలు బి.కిషన్,పానుగంటి పర్వతాలు, ప్రవీణ్‌కుమార్,వి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో జరిగిన సదస్సులో మాట్లాడుతున్న అజీజ్‌పాషా

పార్టీ వంద సంవత్సరాల వేడుకల్లో పాల్గొన్న పార్టీ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య తదితరులు

విప్లవ పోరాటాల ద్వారా పార్టీని కాపాడుకుందాం

శంషాబాద్ రూరల్, డిసెంబర్ 26 : విప్లవ పోరాటల ద్వారా పార్టీని కాపాడుకుందామని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పిలుపునిచ్చారు. గురువారం శంషాబాద్ పట్టణంలోని సీపీఐ వంద సంవత్సరాల సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాటాడులూ విప్లవ పోరాట ద్వారా పార్టీని కాపాడుకుందామన్నారు. వంద ఏండ్ల క్రితం ఏర్పాటైన పార్టీని దశలవారీగా ముందుకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు. పార్టీతోనే బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం కృషి చేసిన్నట్లు వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పర్వతాలు, మండల కార్యదర్శ నర్రగిరితో పాటు పలువురు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

బన్సీలాల్‌పేట్, డిసెంబర్ 26: గత ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఆశా వర్కర్ల సంక్షేమం కోసం ఇచ్చిన హామీలను నెరవేర్చంలో ఘోరంగా విఫలమైందని సనత్‌నగర్ జోన్ సీఐటీయూ కార్యదర్శి పి.మల్లేశ్ విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆశాలు ఎదుర్కొంటున్న సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామంటూ ఇచ్చిన హామీలేమయ్యాయని ప్రశ్నించారు. నాయమైన తమ డిమాండ్ల సాధన కోసం ఈనెల 31న ఇందిరా పార్క్ ధర్నాచౌక్‌లో నిర్వహించనున్న బస్ జాతా ముగింపు సభ జరుగనుంది. గురువారం జరిగిన సన్నాహక కార్యక్రమాల్లో భాగంగా బోయిగూడలోని గాంధీ ఆరోగ్య కేంద్రంలో సీఐటీయూ టీజీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా సెంట్రల్ సిటీ ప్రధాన కార్యదర్శి అనిత, వెంకటమ్మ, పద్మసుశీల, మహేశ్వరి, వరలక్ష్మి, నందినితో కలిసి పోస్టర్ ఆవిష్కరణలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫిబ్రవరిలో జరిగే బడ్జెట్ సమావేశాల్లో ఆశా వర్కర్ల వేతనాలను రూ.18 వేలకు పెంచేవిధంగా, వారి విధుల్లో పని భారాన్ని తగ్గించడం, ఈఎస్ఐ, పీఎఫ్, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. రిటైర్మెంట్, ప్రమోషన్ బెనిఫిట్ కల్పించాలని డిమాండ్ చేశారు.

పోస్టర్ ఆవిష్కరణలో యూనియన్ ప్రతినిధులు

బీసీ సంక్షేమ హాస్టళ్లను ఏర్పాటు చేయాలి

కాచిగూడ, డిసెంబర్ 26: కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాల్లో బీసీ సంక్షేమ హాస్టళ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జాతీ య బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్‌పటేల్‌గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం నింబోలిఅడ్డాలో మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందులతో ఉన్నత విద్యకు దూరమవుతున్న బీసీ విద్యార్థులకు ఫీజు రియింబర్స్‌మెంట్ పథకాన్ని తక్షణమే ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. బీసీల కుల వృత్తుల వారికి సబ్సిడీ రుణాలను మంజూరు చేయాలని కోరారు. కృష్ణ, ముత్యాల్ రావు, ప్రదీప్‌గౌడ్, కిశోర్, నాగేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయ కళల వ్యాప్తికి కృషి

ముషీరాబాద్, డిసెంబర్ 26: విదేశాల్లో స్థిరపడిన తెలుగువారు అక్కడ భాష, సంప్రదాయ కళల వ్యాప్తికి విశేషంగా కృషి చేస్తున్నారని వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు అన్నారు. బుధవారం ఎస్సీబీ మ్యూజిక్ ఇంటర్నేషనల్(యుఎస్ఏ)ఆధ్వర్యంలో శ్రీముఖి కాంప్లెక్స్ ఎలైడ్ ఆర్టిస్ట్స్ ఆడిటోరియంలో ఎస్సీబీ మ్యూజిక్ ఇంటర్నేషనల్ ఛైర్మన్ గూడూరు శ్రీనివాస్‌కు ప్రవాస భారతీయ వంశీ గ్లోబల్ అవార్డు ప్రదానోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని అవార్డు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ విఖ్యాత గాయకుడు బాల సుబ్రహ్మణ్యం పేరిట సంగీత సంస్థను స్థాపించి ఆయన పాడిన పాటలు అక్కడి వారికి ప్రచారం చేస్తున్న పాటల ప్రియుడు శ్రీనివాస్ అని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో గాయకుడు పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

That the General public at large are hereby informed that My Client entered into Agreement of sale to purchase House Bearing No. **3-6-306**, with appurtenant Open Land admeasuring **4100 Sq. Yards** Equivalent to **3428.1 Sq. Meters, Situated at Himayath Nagar,** Hyderabad, T.S., and bounded as follows: North: legend premier Apartment, South: Road, East: Shop No. 3-6-307/A /4/1 (Western hybrid seeds), West: H.No. 3-6-307/A & B (Mahindra Motor), from **Mr. MIR HAMED ALI KHAN, S/o. MIR IBRAHIM ALI KHAN,** Age about: 76 years, Occ: Business R/o. H.No. 3-2-317, Chappal bazaar, Kachiguda, Hyderabad, If any individual Banks, Public/Private any Financial Institutions or Governmental Agencies etc., are having rights, Mortgages, interests, liens, sales agreement, court cases, litigations etc., over the above said property as a Mortgagor, purchaser or Agreement holder, lein holder etc., may approach the under signed with all Original relevant documents within a period of 7 days from the date of this publication, failing which my client will proceed as per law and get it registered. Objections raised after due date will not be entertained.

K.V. AJITH KUMAR, Advocate
Office No. 305,310, Raghava Ratna Towers, Chirag-Ali-lane, Abids, Hyderabad-500001.